REGD NO : APTEL 16144



జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com


**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690


సంపుటి : 4 | సంచిక : 315 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 29-05-2025 | పేజీలు : 5

# చరిత్ర సృష్టించేలా యోగా డే



- 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో నిర్వహిస్తాం
- యోగాంధ్ర తీర్మానంపై చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా లక్ష ప్రదేశాల్లో కార్యక్రమాలు
- 2 కోట్ల మందికిపైగా భాగస్వామ్యం లక్ష్యం
- గ్రామ స్థాయి వరకు కమిటీల ఏర్పాటు

**అమరావతి, మే 28 (జనస్వరం) :** రాష్ట్రాన్ని యోగాంధ్రగా మార్చాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మహానాడు రెండో రోజున యోగాంధ్ర తీర్మానంపై ఆయన మాట్లాడారు. 'రోజువారీ పనుల కారణంగా ప్రతి ఒక్కరూ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లు రాష్ట్ర ప్రజలంతా అనునిత్యం భయం, ఒత్తిడిలో ఉన్నారు. ఎవరిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తారో తెలియక ఇబ్బందులు పడ్డాం. యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేయాలి. దీంతో శక్తి, ఏకాగ్రత పెరుగుతుంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిద్దామని ప్రధాని మోదీ కోరారు. మీ అందరిపై నమ్మకంతో చరిత్ర సృష్టించేలా యోగాడే నిర్వహిస్తామని ఆయనకు మాట ఇచ్చా. యోగా డేని ఘనంగా నిర్వహించి ఏపీని ప్రపంచ పటంలో నిలబెడదాం. యోగా దినోత్సవాన్ని ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు 5 లక్షల మందితో నిర్వహించబోతున్నాం. ఇలా ఒకే చోట 5 లక్షల మందితో యోగాడే నిర్వహించడం ఎక్కడా జరగలేదు. యోగా డే రోజు రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది యోగాలో పాల్గొనేలా లక్ష్యం పెట్టుకున్నాం. ఇంతకు ముందు గుజరాత్‌లో 1.53 లక్షల మందితో యోగా నిర్వహించారు. ఆ రికార్డును తిరగరాసేలా యోగా డే నిర్వహించబోతున్నాం. 20 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందిస్తాం. 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగా డే నిర్వహిస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

**యోగాంధ్ర అమలుకు మార్గదర్శకాలు విడుదల :**

వచ్చే నెల 21న ప్రధాని మోదీ విశాఖపట్నంలో పాల్గొననున్న యోగాంధ్ర సభ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను తాజాగా విడుదల చేసింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలు జూన్ 21న విశాఖపట్నంలో ప్రధాని పాల్గొనే కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా స్థాయిల్లో ప్రతిభ చూపిన వారికి అవార్డులు ప్రకటిస్తారు. రాష్ట్రస్థాయిలో అమరావతిలో గ్రాండ్ ఫైనల్ కూడా నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందికిపైగా యోగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయాలని ప్రణాళికలు రూపొందించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, పరిశ్రమలు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సుమారు లక్ష చోట్ల యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ వైస్‌చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా, మండల స్థాయిలో ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్ చైర్మన్‌గా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి/వార్డ్ సెక్రటరీ చైర్మన్‌గా కమిటీలు ఏర్పాటు చేశారు.

**రెండు రాష్ట్రాలూ నాకు సమానమే :**

ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండూ తనకు సమానమేనని.. రెండూ అభివృద్ధి చెందాలన్నదే తన ఆశ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులు కడితే తామెప్పుడూ అభ్యంతరం చెప్పలేదని ఆయన గుర్తుచేశారు. "పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా ఏపీలోని అన్ని ప్రాంతాలకూ నీరిచ్చేలా కార్యాచరణ రూపొందించాం. పోలవరం నుంచి కృష్ణానదికి.. అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు.. అక్కడి నుంచి బనకచర్లకు నీటిని తరలిస్తాం. ఈ అనుసంధానం పూర్తయితే ఏపీ ముఖచిత్రమే మారిపోతుంది. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని వాడుకుంటే తెలంగాణకూ లాభమే. బీఆర్ఎస్ దీనిపై లేనిపోని విమర్శలు చేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది.. సైబరాబాద్‌ను సృష్టించింది తెలుగుదేశమేనని... దేశంలో ఎక్కువ ఆదాయం వచ్చేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దింది కూడా టీడీపీయేనని చంద్రబాబు గుర్తుచేశారు. కడప మహానాడులో రెండో రోజు బుధవారం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన ముగింపు ప్రసంగం చేశారు. ప్రపంచంలో తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెట్టే శక్తిసామర్థ్యాలు ఒక్క టీడీపీకే ఉన్నాయన్నారు. ఏపీలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదన్నారు. గంజాయి, డ్రగ్స్ రాజ్యమేలాయని.. ఏజెన్సీలో గంజాయి సాగు గ్రామస్థాయి పరిశ్రమగా మారిందని చెప్పారు. నేరాలను వ్యవస్థీకృతంగా మార్చేశారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలోని అధినేతే సొంత బాబాయిని చంపి ఆ నిందను తనపై వేశారని అన్నారు. రాయలసీమ సుభిక్షానికి ప్రాజెక్టులు చేపట్టామన్న బాబు.. సీమను కరువుసీమ, ఎడారి సీమ కానివ్వబోనని హామీ ఇచ్చారు. 2027 డిసెంబరుకు పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.

**అదే సంకల్పం.. :**

తెలుగుదేశం పార్టీకి తాను ధర్మకర్తను మాత్రమేనని.. ఎన్టీఆర్ ఇచ్చిన వారసత్వాన్ని కాపాడుకుంటూ.. మళ్లీ భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి తెలుగుజాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేయాలన్నదే సంకల్పమని, దీని కోసం రాబోయే 40 ఏళ్లకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. 43 ఏళ్లుగా టీడీపీ జెండా రెపరెపలాడుతోందంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలేనని.. వారి సంక్షేమం కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. "రాజకీయ, పాలనా అంశాల్లో రాష్ట్రం ఫస్ట్. పార్టీ విషయంలో కార్యకర్తే ఫస్ట్. కార్యకర్తే అధినేత. ప్రాంతీయ పార్టీగా పుట్టిన టీడీపీలో సభ్యత్వాల సంఖ్య నేడు కోటికి చేరింది. ఇదీ మన బలం" అని సగర్వంగా ప్రకటించారు. కరడుగట్టిన నేరస్థులతో రాజకీయం చేస్తున్నామని.. కాబట్టి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలను హెచ్చరించారు. కాగా.. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. మరోవైపు.. చంద్రబాబు కుమారుడు లోకేశ్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. బుధవారం మహానాడు వేదిక నుంచే పలువురు సీనియర్ నేతలు ఆయనకు కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని కోరారు. ఇక.. మహానాడులో రెండోరోజు ప్రవేశపెట్టిన అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రతిపాదించారు. జననేత చంద్రబాబును అరెస్ట్ చేయడం ద్వారా వైసీపీ సర్కారు చేయకూడని తప్పు చేసిందని, దాని ఫలితాన్ని కూడా ఆ పార్టీ అనుభవించిందని పేర్కొన్నారు. 43 ఏళ్ల పార్టీ.. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో మరో 40 ఏళ్ల ప్రయాణానికి సిద్ధమవుతోందన్నారు. లోకేశ్ ప్రజలు మెచ్చిన నాయకుడే కాదు.. ప్రధాని మోదీ



మెచ్చిన నాయకుడని చెప్పారు. ఆయన రూపొందించిన ఆరు శాసనాలే ఆరు ఆయుధాలుగా పార్టీ భవిష్యత్ కోసం పనిచేద్దామని పిలుపిచ్చారు. ఇక.. 'మా తెలంగాణలో ముక్కోడు, మీ ఏపీలో మీకు తిక్కోడు పోయారు" అంటూ తెలంగాణ టీడీపీ నేత నన్నూరి నర్సిరెడ్డి ఎప్పట్లాగానే మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. "పార్లమెంటులో ప్రధాన భూమిక పోషించే స్థాయి, సత్తా టీడీపీకి ఉందని నిరూపించిన ఘనత అన్న ఎన్టీఆర్‌ది. అన్న ఎన్టీఆర్ పేదలకు కిలో రెండు రూపాయలకే బియ్యం తెస్తే, 20 ఏళ్ల తర్వాత భారత ప్రభుత్వం దానిని ఆహార భద్రత చట్టంగా చేసింది. టీడీపీ నేడు చేసే ఆలోచన, దేశానికి 20 ఏళ్ల తర్వాత మార్గదర్శకంగా నిలుస్తుంది" అని ఆయన కొనియాడారు. కాగా.. మహానాడులో రెండో రోజు బుధవారం దాదాపు లక్ష మందికి భోజన వసతి కల్పించారు. రాయలసీమ రుచులతో పాటు, ఎన్టీఆర్‌కు ఇష్టమైన నేతి మిఠాయిలు, చక్కెర పొంగలి, వెజ్ పలావ్, చికెన్, మటన్ ఐటమ్స్‌తో భోజనాలు ఏర్పాటు చేశారు.

**మహానాడులో తెలంగాణపై తీర్మానాలు :**

తెలంగాణ వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై మహానాడులో చర్చను తెలంగాణ నేత నెల్లూరు దుర్గాప్రసాద్ ప్రతిపాదించారు. "చంద్రబాబు హయాంలో మహబూబ్‌నగర్, దక్షిణ తెలంగాణలో 90 శాతం ప్రాజెక్టులు పూర్తి చేశారు, మిగతా పనులు పూర్తి చేయాలి. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం లేదు. కృష్ణ, గోదావరి అనుసంధానంతో రైతులకు మేలు జరుగుతుంది. తెలంగాణలో ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలి' అని అందులో ఆయన ప్రతిపాదించారు.


**5 లక్షల మందితో నేడే టీడీపీ సభ :**

మహానాడు చివరి రోజు గురువారం కడపలోనే నిర్వహించే బహిరంగ సభను చంద్రబాబు, లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. 5 లక్షల మందితో 'నభూతో' అనే తరహాలో సభ జరిపి.. జగన్ సొంత జిల్లాలో పసుపు సైన్యం సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు మహానాడు వేదిక వద్దే ఈ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు కడప సహా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేస్తున్నారు. ఒక్క ఉమ్మడి కడప జిల్లా నుంచే 2.10 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు మొత్తం 5 వేల వాహనాలను ఇందుకు వినియోగించనున్నారు.

**ప్రజాభిమానాన్ని చూరగొన్న నేత ఎన్టీఆర్ : ప్రధాని మోదీ**

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. 'పేదల, నిమ్న వర్గాల అభ్యున్నతి దిశగా చేసిన కృషికి ఎన్టీఆర్‌ఎంతగానో ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. ఆయన నటించిన సినిమాలు నేటికీ అలరిస్తున్నాయి. ఆయన మనందరికీ ఎనలేని స్ఫూర్తిని అందించారు. నా మిత్రుడు చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తోంది' అని మోదీ పేర్కొన్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 29 మే 2025,**

**తిథి :** శుద్ధ విదియ (తె.01:58 వ.కు), శుద్ధ తదియ (రా.11:22వ.కు), **నక్షత్రం :** మృగశిర (తె.00:31 వ.కు), ఆరుద్ర (రా.10:41వ.కు), **బ్రహ్మ ముహూర్తం :** తె.04:01ల తె.04:49,

**రాహుకాలం :** మ.01:42ల మ.03:19,

**యమగండం :** ఉ.05:37ల ఉ.07:14,

**వర్జ్యకాలం :** ఉ.08:13ల ఉ.09:54

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 29 మే 2025,**

**ఫజర్ :** తెల్లవారుజామున గం. 04:31

**సూర్యోదయం :** ఉదయం గం. 05:49

**జొహర్ :** మధ్యాహ్నం గం. 12:18

**అసర్ :** సాయంత్రం గం. 03:40

**మఘ్రిబ్ :** సాయంత్రం గం. 06:45

**ఇష :** రాత్రి గం. 08:04





**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# చంద్రబాబు కొత్త రికార్డు!

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నారా చంద్రబాబు మరోసారి ఎన్నికయ్యారు. మహానాడు వేదికగా మంగళవారం జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగింది. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ నేతలతో పాటు శ్రేణులు నివాళులర్పించారు. అనంతరం మంగళవారం ప్రవేశపెట్టిన తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు కీలక ప్రసంగం చేశారు. తెలుగుదేశం పార్టీ ఎన్నో మైలురాళ్లను అధిగమించి ఈ స్థానానికి చేరుకుందని కొనియాడారు. మరో నాలుగు దశాబ్దాల పాటు తెలుగు నాట తెలుగుదేశం పార్టీ నిలబడుతుందని కూడా చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో సాయంత్రం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ నేత వర్ల రామయ్య ప్రకటించారు. దీంతో ఒక ప్రాంతీయ పార్టీకి 30 ఏళ్ల పాటు అధ్యక్షత వహిస్తూ రికార్డు సృష్టించారు చంద్రబాబు.

**1995లో తొలిసారిగా.. :**

1995లో తొలిసారిగా టీడీపీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు. 1995 ఆగస్టు సంక్షోభంలో తొలిసారిగా ముఖ్యమంత్రి అయ్యారు. పార్టీ అధ్యక్ష బాధ్యతలను కూడా స్వీకరించారు. అప్పటి నుంచి పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా అధ్యక్ష పదవిలో మాత్రం చంద్రబాబు కొనసాగుతూ వచ్చారు. 2014లో రాష్ట్రాన్ని విభజించారు. ఆ సమయంలో చంద్రబాబు జాతీయ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు. ఏపీ, తెలంగాణకు వేరువేరుగా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. కానీ జాతీయ అధ్యక్ష బాధ్యతలను మాత్రం చంద్రబాబు నిర్వర్తిస్తూ వచ్చారు. నందమూరి తారక రామారావు 1982 నుంచి 1995 వరకు.. 13 సంవత్సరాల పాటు పార్టీ అధ్యక్ష



## ఎడిటోరియల్

బాధ్యతలను చూశారు. కానీ చంద్రబాబు మాత్రం ఏకంగా మూడు దశాబ్దాల పాటు పార్టీ అధ్యక్ష బాధ్యతలు చూడడం విశేషం.

**సరికొత్త రికార్డు.. :**

అయితే చంద్రబాబుకు ఒక్క అధ్యక్ష బాధ్యతలే కాదు.. ఉమ్మడి రాష్ట్రంలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న సీఎంగా రికార్డు సృష్టించారు. అదే సమయంలో ప్రతిపక్ష నేతగా కూడా రాణించారు. ఉమ్మడి రాష్ట్రంలో 9 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన.. పదేళ్లపాటు ప్రతిపక్ష నేతగా కూడా కొనసాగారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా ఎన్నికై రికార్డ్ సృష్టించారు. ఐదేళ్లపాటు నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పాత్ర కూడా పోషించారు. 2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించి చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఒక పార్టీ అధినేతగా, ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా చంద్రబాబు రికార్డు చెరపరానిది.

**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**



## భాగవతులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి



**పులివెందుల మే 28 (జనస్వరం) :** రాయలసీమ ప్రాంతంలో ఆధ్యాత్మిక ప్రవచనాలను బోధిస్తున్న భాగవతులను గుర్తించి వారికి సామాజిక భద్రతా పథకం కింద పింఛన్ అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రాలకు నేరుగా ధర్శనభాగ్యం కలుగ జేయాలని రాయలసీమ భక్త సమాజం సమైక్య కన్వీనర్ యాగంటి బాలకృష్ణా రెడ్డి కోరారు. ఆ మేరకు పులివెందులకు విచ్చేసిన అననంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రాయలసీమ పరిధిలో మొత్తం 22 భాగవత భక్త సమాజములు ఉన్నాయని, ఇందులో 5000 మంది భాగవతులు ఆధ్యాత్మిక ప్రవచనాలను వల్లిస్తున్నారన్నారు. భాగవతం, రామాయణం, మహాభారతం, భగవత్ గీత పఠనం వీరినిత్యకృత్యం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని, వారిని భక్తి మార్గంలో చైతన్యం నింపేందుకు కృషి చేస్తుంటారని తెలిపారు. దీనివలన గ్రామాలలో సమైక్యత, ప్రశాంతత కోసం కృషిచేస్తున్నారు. యువకులు, మహిళలు, వృద్ధులు నేటి నాగరిక సమాజంలో హిందూ సంస్కృతి సంప్రదాయాలు సన్నగిల్లకుండా భాగవతం, రామాయణం, మహాభారతం, భగవత్ గీత పఠనం ద్వారా అందరిని చైతన్యపరచడం భాగవతుల ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా చాలా మంది కొన్ని ఘట్టాలలో ప్రావిన్యం పొందినవారు అనర్గళంగా చూడకుండా పఠనం చేసేవారు చాలామంది ఉన్నారని, అందుకని సమాజహితం కోసం కృషిచేస్తున్న భాగవతులకు కళాకారుల కింద పింఛన్ అందజేస్తే బాగుంటుందని ఆ దిశగా మీరు చొరవ చూపాలని కోరుతున్నామన్నారు. మారుమూల గ్రామలలో భాగవతపఠనం చేస్తూ ప్రజల ఐక్యత కోసం పాటుపడుతున్నారని వెల్లడించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు బాలకృష్ణ వెల్లడించారు.

## దోమకాటు - ఆరోగ్యానికి చేటు : వైద్యాధికారి అయేష



**పులివెందుల, మే 28 (జనస్వరం) :** దోమకాటు ఆరోగ్యానికి చేటని డాక్టర్ అయేషా పేర్కొన్నారు. పులివెందుల సబ్ యూనిట్ పరిధిలోని బిదినంచెర్లలో వైద్యాధికారి డాక్టర్ అయేష ఆధ్వర్యంలో "సీజనల్ వ్యాధులపై అవగాహన – ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత"పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలకు దోమల వల్ల వ్యాపించే వ్యాధుల గురించి, వాటి నివారణ చర్యలపై వివరంగా తెలియజేశారు. అనంతరం అయేషా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమం ద్వారా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## యలమంచిలి ఎంపీపీగా ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్



**యలమంచిలి, మే 28 (జనస్వరం) :** యలమంచిలి మండల పరిషత్ అధ్యక్షులుగా ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ ధనలక్ష్మి భారీ ర్యాలీగా మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. వైఎస్సార్ అభిమానులు జై జగన్ అంటూ నినాదాలు చేసారు. అనంతరం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పోత్తూరి బుచ్చిరాజు, మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్, పొత్తూరి బుచ్చిరాజు, గుడాల శ్రీహరి గోపాలరావు తనయుడు గుడాల సాయి బాలాజీ, ముఖ్య వైసీపీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**- ఎన్టీఆర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ నివాళులు**
**- పురాణ పాత్రల్లో నటించి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచారు**
**- కలెక్టర్ వెట్రిసెల్వి**






**ఏలూరు, మే 28 (జనస్వరం) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ డా.నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఏలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ముఖ్య అతిథిగా హాజరై డా. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించగా, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు. మాతెలుగు తల్లికి మల్లెపూదండ ప్రార్ధనాగీతంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం డా. ఎన్టీఆర్ జీవితం, సినిమాలపై దృశ్య ప్రదర్శన నిర్వహించారు.

**కూచిపూడి నృత్యం ఆకట్టుకున్న చిన్నారులు :**

గండికోట రాజేష్ శిష్యబృందం లవకుశ చిత్రంలోని శ్రీరామ కల్యాణం, పట్టాభిషేకం సన్నివేశాలను ఆధారంగా చేసుకొని అందమైన కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ ఈ ప్రదర్శనను ప్రశంసిస్తూ చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

**కలెక్టర్ వెట్రిసెల్వి ప్రసంగం :**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. ఆయన తెలుగు సంస్కృతికి ప్రతీక. నటుడిగా దేవత పాత్రల ద్వారా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించి, నాయకుడిగా అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు," అన్నారు. తన కుటుంబానుభవాన్ని గుర్తు చేసుకుంటూ, "నా తండ్రి ఎన్టీఆర్ సినిమాలు చూస్తూ ఎంతో స్ఫూర్తి పొందారు. కర్ణుడి పాత్రలో



ఆయన పాడిన పాట ఆయనకు ఎంతో ఇష్టమని నేను కూడా ఎంతో మదిన పెట్టుకున్నాను," అన్నారు. "స్వస్థ భవంతి, మహిళలకు ఆస్తి హక్కు, రెండు రూపాయలకే బియ్యం, పక్కా ఇళ్లు వంటి సంక్షేమ కార్యక్రమాల పునాది ఆయన వేసినవే," అని పేర్కొన్నారు. తిరుమల అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మహనీయుడిగా పేర్కొన్నారు.

**ఇతర ప్రముఖుల భావవ్యక్తీకరణ :**

విశ్రాంత రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "ఎన్టీఆర్ సమయపాలన, క్రమశిక్షణకు ప్రతిరూపం. ఆయనను తరతరాల తెలుగు వారు గుర్తు చేసుకుంటారు" అన్నారు. శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎం.బి.ఎస్. శర్మ మాట్లాడుతూ, "ప్రజలే దేవుళ్లని విశ్వసించి, సంక్షేమరాజ్యాన్ని నిర్మించడంలో ఎన్.టి.ఆర్. లౌకికవాదానికి చిరునామా," అన్నారు. ఆయన 300కి పైగా చిత్రాల్లో నటించి నటనా ప్రతిభను ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు. వై. ఆనందనాయుడు మాట్లాడుతూ, "బీసీలకు పట్టం కట్టిన జననేత ఎన్టీఆర్ తెలుగు వారికి గౌరవాన్ని తెచ్చిన నేత. ఆయనకు భారత రత్న ఇవ్వాలని ప్రజల ఆశ," అన్నారు.

**ఫోటో ప్రదర్శన ఆకర్షణ :**

ఈ సందర్భంగా డా. ఎన్టీఆర్ జీవితానికి సంబంధించిన అరుదైన ఫోటోలను ప్రదర్శించారు. కలెక్టర్ సహా అధికారులు, విద్యార్థులు వీటిని తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ చోడే వెంకటరత్నం, సెట్‌వెల్ మేనేజర్ సత్యనారాయణ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ పట్టాభి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రుతుస్రావం.. ఒక సాధారణ ప్రక్రియ




**పులివెందుల, మే 28 (జనస్వరం) :** ఆడవారికి రుతుస్రావం అనేది ఒక సాధారణ ప్రక్రియ అని డాక్టర్ లక్ష్మీ ప్రియ అన్నారు. ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకొని వేంపల్లి మండలం తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో బుధవారం ఈ అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రియ మాట్లాడుతూ రుతుస్రావం అనేది సాధారణ ప్రక్రియ ఆడవారికి సాధారణంగా 10 నుండి 14 సం.లో మొదలై 45 నుండి 49 సం.లకు ఆగిపోతుందన్నారు. ఇది వ్యాధి కాదని. ఈ సమయంలో కూడా సాధారణంగా చేసే ప్రతి పనిని చేయవచ్చన్నారు. ప్రతి రోజు స్నానం చేయాలని, శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శానిటరీ నాప్కిన్స్ వాడిన వాడేసిన శానిటరీ నాప్కిన్ కాగితంలో చుట్టి డస్ట్ బిన్‌లో పరవేయాలి లేదా కాల్చి వేయాలన్నారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ వున్నిసా మాట్లాడుతూ నాప్కిన్స్ ప్రతి 4 నుండి 6 గంటలకు ఒకసారి మార్చుకోవాలన్నారు. నెలసరి సాధారణంగా 4 నుండి 5 రోజులు ఉంటుందని నెలసరిలో కనిపించే లక్షణాలు నెలసరి లేదా బహిష్టు అంటారని తెలిపారు. కొంతమంది బాలికల్లో అసౌకర్యంగా ఉంటుందని, ఛాతీలో నొప్పి, పొత్తికడుపు నిండినట్లు అనిపించడం కొంతమందిలో మలబద్ధకం ఉంటుందన్నారు. ప్రతినెలా సగటు 4 నుండి 5 రోజులు రక్తస్రావం అవుతుందన్నారు. ఆ 5 రోజులలో 60 ఎంఎల్ రక్తం కోల్పోతామని ఒకవేళ నెలసరి క్రమబద్ధం అవ్వకపోతే దగ్గరలో ఉన్న గైనకాలజిస్ట్‌తో చూపించుకోవాలన్నారు. విశ్రాంతి, పోషకాహారం ఐరన్ కలిగిన ఆకుకూరలు, పండ్లు కూరగాయలు తీసుకోవాలన్నారు. రుతుక్రమం పట్ల మూఢనమ్మకాలు విడిచి పెట్టాలన్నారు. శానిటరీ ప్యాడ్స్ ప్రతి గవర్నమెంట్ హై స్కూల్‌లో, కళాశాలల్లో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఓ ఫకృద్దీన్, సూపర్వైజర్‌లు అరుణ దేవి, అంకయ్య, సీహెచ్ ఓ బసయ్య, కౌన్సిలర్ ప్రభావతి, ఆశాలు పాల్గొన్నారు.

## రేఖపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



విఆర్ పురం, మే 28 (జనస్వరం) : తెలుగు జాతి ఆత్మగౌరవంగా నిలిచిన మహానాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని రేఖపల్లి ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు దేశం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేస్తూ నేతలు ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించిన సీనియర్ నాయకుడు ముత్యాల రామారావు మాట్లాడుతూ, "ఇండియా సినీ చరిత్రలో ఓ వెలుగువెలిగిన కథానాయకుడు మాత్రమే కాకుండా, సామాజిక చైతన్యానికి పురుడు పోసిన మహానుభావుడు ఎన్టీఆర్. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన నేత" అని అన్నారు. జెడ్పీటీసీ సభ్యులు వళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ, "టీడీపీ తెలుగు ప్రజల గుండెల్లో పుట్టింది. నిరుపేదలకు రెండు రూపాయలకే బియ్యం వంటి గొప్ప పథకాలను అందించిన ఎన్టీఆర్ ఆశయాలను ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, ఎంపీటీసీ వళ్ళ వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గొంది చంద్రయ్య, జంగాల మల్లికార్జున రావు, ఐటీడీపీ కన్వీనర్ ముత్యాల సింధ్దు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్రా నరేష్, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్యప్రకాశ్ రావు, మండల కార్యదర్శులు బుర్రక సారయ్య, కారం సిరమయ్య, బొర్రా ఆదినారాయణ, వడ్డాణపు సత్యనారాయణ, మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆశయాల్ని గుర్తుచేస్తూ, ఆయన ప్రారంభించిన సంక్షేమ పథకాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని నేతలు తెలిపారు. ఎన్టీఆర్ పేరు చెబితే తెలుగువారి గుండె గర్భం ఉప్పొంగుతుందని, ఆయనకు భారత రత్న ఇవ్వాలన్న డిమాండ్‌ను మరోసారి వినిపించారు.

# సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**- జనవాణిలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**

**- చట్టపరంగా గంజాయి మత్తులో ఉన్న వారిపై కఠిన చర్యలు**



**యలమంచిలి, మే 28 (జనస్వరం) :** నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రజల సమస్యలు నేరుగా వినేందుకు ముందుకొచ్చారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ లోని రైల్వే స్టేషన్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన "జనవాణి" కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. విలేకరులతో మాట్లాడిన ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజలకు ఉత్తమ పాలన అందించడమే నా ధ్యేయం. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలి" అని అన్నారు.

**అమృత్ 2.0లో ఇంటింటికీ నీరు :**
అమృత్ 2.0 ప్రణాళిక కింద త్వరలో ఇంటింటికి కుళాయిల ద్వారా నీటి సరఫరా ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. యానాద్రి కాలువ నిర్మాణం ప్రారంభించామని, మిగతా డ్రైనేజీలు, రహదారి పనులకు కూడా సమగ్ర ప్రణాళిక సిద్ధంగా ఉందని తెలిపారు.

**గురజాడ డిగ్రీ కాలేజీకి లార్స్ కంపెనీతో భాగస్వామ్యం :**
యలమంచిలిలోని శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా నాణ్యతలో రాష్ట్ర స్థాయిలో గౌరవ స్థానం సాధించిందని తెలిపారు. ఇందులో భాగంగా లార్స్ కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకుంటున్నామని, విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**గంజాయి మత్తులో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు :**
కళాశాలల మధ్య గల క్రీడా మైదానంలో అసాంఘిక శక్తులు గంజాయి సేవిస్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తన దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు కఠిన చర్యలకు ఆదేశించామని వెల్లడించారు. "ఇలాంటి ఘటనలకు శాశ్వత పరిష్కారం కోసం పోలీసు పర్యవేక్షణ పెంచాం," అని తెలిపారు.

**అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలి :**
మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో అపరిచితులు అద్దెకు ఉండటం ద్వారా మోసపూరిత కార్యకలాపాలకు అవకాశం ఉండవచ్చని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, కొత్త వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ :**
"డ్రంక్ అండ్ డ్రైవ్ కల్చర్‌ను పూర్తిగా నిర్మూలించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అదే దిశగా మా నియోజకవర్గంలో చట్టసమ్మత పాలనను అమలు చేస్తాం," అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## "బసవతారకం"లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు





**హైదరాబాద్, మే 29 (జనస్వరం) :** ఆంధ్ర ప్రజల అభిమాన నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాలకు స్వర్గీయ ఎన్టీఆర్ కుమార్తె, హాస్పిటల్ ట్రస్టు బోర్డు సభ్యురాలు నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాస్పిటల్ ఆవరణలో ఉన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు, బసవతారకం విగ్రహాలకు ఆమెతో పాటు వైద్యులు, హాస్పిటల్ యాజమాన్యం పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆరోగ్య శ్రీ వార్డు, పిల్లల వార్డును సందర్శించిన నారా బ్రాహ్మణి అక్కడ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగులతో, వారి బంధువులతో సంభాషించిన ఆమె చికిత్సలపైన ఫీడ్‌బ్యాక్ తీసుకుని హాస్పిటల్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ వేడుకల్లో ట్రస్టు బోర్డు సభ్యులు జెఎస్ఆర్ ప్రసాద్, డా.టి.ఎస్.రావు, మెడికల్ డైరెక్టర్ డా.ఫణి కోటేశ్వర రావు, మెడికల్ సూపరింటెండెంట్ డా.సెంథిల్ రాజప్ప, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా.కల్పనా రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు. పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది కూడా ఈ కార్యక్రమానికి హాజరై ఎన్టీఆర్ స్మృతిని స్మరించుకున్నారు. తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ ఆశయాలకు తగిన విధంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఈ హాస్పిటల్, ఆరోగ్య రంగంలో నూతన అధ్యాయాన్ని కొనసాగిస్తోంది.

## కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు

**వైసీపీ నాయకులకు బీటెక్ రవి హెచ్చరిక**



**పులివెందుల, మే 28 (జనస్వరం) :** కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కో వాల్సి వస్తుందని వైసీపీ నాయకులకు బీటెక్ రవి హెచ్చరించారు. పట్టణంలో టీడీపీ జెండాల తొలగి ంచడంపై స్పందించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ పట్టణంలో తాము ఎక్కడ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాల వద్ద జెండాలు ఏర్పాటు చేయలేదన్నారు. పులివెందులలో ఎక్కడ చూసినా వైఎస్సార్ విగ్రహాలే ఉన్నాయని, తాము ఎక్కడ కూడా వైఎస్సార్ విగ్రహాలకు జెండాలు కట్టలేదన్నారు. మేము కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదని మీరు కక్షసాధింపు చర్యలు చేపడితే తీవ్ర పరిణా మాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. వైసీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని, రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. వైఎస్సార్ మీద గౌరవం ఉందని, మీకు నిజంగా వైఎస్సార్ మీద గౌరవం ఉంటే వైఎస్సార్ తమ్ముడు వివేకానంద రెడ్డిని చంపిన నాయకుల కాలర్ పట్టుకోవాలన్నారు. మహానాడు సందర్భంగా కడప మహానాడుకు పులివెందుల మీదుగా వచ్చే టీడీపీ కార్యకర్తల కోసం తాము భోజన సదుపాయాలు ఏర్పాటు చేసు కుంటుంటే రెచ్చేగొట్టేలా వ్యవహరుస్తున్నారు. మమ్మల్ని రెచ్చకోడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని మరోమారు హెచ్చరించారు.

## దుకాణాల చెంత మద్యం తాగుబోతులు రౌడీయిజం

**విజ్ఞప్తి లేని తాగుబోతుల వల్ల వ్యాపారులకు అవస్థలు**





**చింతపల్లి, మే 28 (జనస్వరం) :** మండల కేంద్రంలోని గ్రామం నడిబొడ్డున ఉన్న మద్యం దుకాణం స్థానిక వ్యాపారులకు కలకలం రేపుతోంది. మద్యం కొనుగోలు చేసిన తాగుబోతులు దుకాణ సముదాయాల వద్దే మద్యం సేవిస్తూ, ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ కప్పులు, చెత్తచెదారం వదిలి వెళ్లిపోతున్నారు. దీంతో వ్యాపార స్థలాల పరిసరాలు అసహ్యకరంగా మారిపోయాయని స్థానిక దుకాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగుబోతుల అశ్లీల ప్రవర్తనతో రోజూ విధ్వంసం జరుగుతుందనీ, దాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేయగానే వ్యాపారులపైనే తిరుగుబాటు చేస్తారని వారు వాపోతున్నారు. ఈ తతంగంతో కస్టమర్లు రాక తగ్గిపోయిందని, ఆదాయానికి గండిపడుతోందని వ్యాపారులు చెబుతున్నారు. తాగుబోతుల వల్ల రాత్రి వేళల్లో దుకాణాలు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఒక వ్యాపారి వేదన వెలిబుచ్చారు. సమస్యపై చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని దుకాణదారులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని మద్యం దుకాణాన్ని ఇతర ప్రాంతానికి మార్చాలని వారు సూచిస్తున్నారు.

## భైంసా బుద్ధ విహార్ షెడ్ నిర్మాణానికి ఆర్థిక సాయం

**రుక్మిణి గ్రూప్ సభ్యుల సహాయంతో విహార్ అభివృద్ధి పనులు వేగవంతం**



**భైంసా, మే 28 (జనస్వరం) :** పట్టణ కేంద్రంలోని బుద్ధ విహార్ ప్రాంగణంలో షెడ్ నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. ఈ నిర్మాణ పనులు బుద్ధ విహార్ టీం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇందుకోసం స్థానిక అంబేద్కర్ సంఘానికి చెందిన సభ్యులు తోచినంత ఆర్థిక సహకారాన్ని అందజేస్తున్నారు. ఈ సందర్భంగా పూలే నగర్‌కు చెందిన రుక్మిణి గ్రూప్ సభ్యులు బుద్ధ విహార్ కమిటీకి రూ.4,000ల నగదు సహాయాన్ని అందజేశారు. వారు మాత్రమే కాక, అదే కాలనీకి చెందిన పలువురు భక్తులు, సంఘ కార్యకర్తలు కూడా నిర్మాణానికి తమవంతుగా ఆర్థిక సాయం చేశారు. వారి సహాయానికి కృతజ్ఞతగా బుద్ధ విహార్ కమిటీ సభ్యులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో విహార్ అభివృద్ధికి అందరి సహకారం కావాలని వారు పేర్కొన్నారు.

## ఆడువారి సమస్యల పరిష్కారానికే ఆరోగ్య దినోత్సవం



**పులివెందుల, మే 28 (జనస్వరం) :** ఆడువారి సమస్యల పరిష్కారానికి జాతీయ మహిళా ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నట్లు డిప్యూటీ డెమో రమణమ్మ తెలిపారు. పట్టణ పరిధిలోని నగరిగుట్ట హెల్త్ సెంటర్ పరిధిలోని సచివాలయంలో బుధవారం ఈ అంశంపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు తమ జీవితాంతం ఎదుర్కొనే ప్రత్యేకమైన ఆరోగ్య సవాళ్లను హై లైట్ చేయడానికి జాతీయ మహిళ ఆరోగ్య దినోత్సవం ఒక ప్రపంచ వేదికగా పనిచేస్తుందన్నారు. మహిళల ఆరోగ్యం, హక్కులు, గౌరవానికి ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రపంచవ్యాప్త పిలుపునిచ్చారన్నారు. పునరుత్పత్తి సంరక్షణ, మానసిక ఆరోగ్యం క్యాన్సర్ నివారణ, హృదయ సంబంధ ఆరోగ్యం వంటి కీలక రంగాలపై దృష్టి సారించడం ద్వారా, తల్లి నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించి నివారించ తగిన మరణాలను అంతం చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. ఇందులో భాగంగా రుతుక్రమ పరిశుభ్రత గురించి తెలియజేశారు. పీరియడ్స్ అనేవి సాధారణ శారీరక ప్రక్రియ, ఆడవారికి సాధారణంగా 10-14 సంవత్సరాలు మొదలై 45-49 సంవత్సరాలలో ఆగిపోతుంది. పీరియడ్స్ టైంలో వారు నచ్చిన పని చేయవచ్చుని వారిని దగ్గరకు తీసుకుని మానసిక దృఢత్వం పెంపొందించాలన్నారు, కాలేజీకి వెళ్లేలా అక్కడ అందుబాటులో ఉండే సానిటరీ నాప్కిన్స్, ఐఎఫ్ఏ మాత్రలు తీసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. శుభ్రత పాటిస్తే ఆనందం అవుతుంది మన సొంతమన్నారు. సమావేశంలో డాక్టర్ స్నేహ, ఆరోగ్య కార్యకర్తలు చిన్నమ్మ, సంపూర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## కుడుముసారి పంచాయతీలో కార్యదర్శి గైర్హాజరు

**- ప్రజల సేవలపై తీరని అన్యాయం జరుగుతోంది**

**- జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆగ్రహం**



**చింతపల్లి, మే 28 (జనస్వరం) :** మండలంలోని మారుమూల కుడుముసారి పంచాయతీలో విధులు నిర్వర్తించాల్సిన కార్యదర్శి తరచూ డుమ్మా కొడుతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు తీవ్రంగా విమర్శించారు. సచివాలయంలో ప్రధాన సిబ్బంది గైర్హాజరుతో ప్రజలు ప్రాథమిక సేవలకు నోచుకోకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ ఆగురు కోటిబాబుతో కలిసి బుధవారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన బుజ్జిబాబు, అక్కడ సిబ్బంది హాజరు, సేవల అందుబాటును సమీక్షించారు. పౌరులు కొత్త రేషన్ కార్డులు, ఆధార్ ఈ కేవైసీ, బ్యాంక్ లింకింగ్ వంటి పనుల కోసం కార్యాలయానికి వస్తున్నా, కార్యదర్శి గైర్హాజరుతో తిరిగి వెనుదిరిగే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన వివరించారు. ప్రస్తుతం డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ వేల్ఫర్ మాత్రమే విధుల్లో ఉన్నారని, మిగిలిన సిబ్బంది గైర్హాజరుతో గ్రామస్తులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అగ్రికల్చర్ అసిస్టెంట్, ఫీల్డ్ వర్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా మారాలి. ప్రజల అవసరాలను గౌరవించే విధంగా ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వార్డ్ సభ్యుడు వంతల దాసు, సీనియర్ నాయకులు వంతల రాజన్, కిల్లో సురేష్, ముష్వల భాస్కర్ రావు, కొర్ర గిరి, గేమ్మెలి బింగ్ నాయుడు, పాంగి మోహన్, తాంబెలి సన్యాసిరావు, పాంగి బుజ్జిబాబు, పాంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధ విగ్రహం తొలగింపుపై దళితుల ఆగ్రహం

**- అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్**

**- జిల్లా కలెక్టర్ అనుమతి లేదు.. అయినా అధికారులు తొలగించారు**



**భైంసా, మే 28 (జనస్వరం) :** నిర్బంధంగా బుద్ధ విగ్రహాన్ని తొలగించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నిజామాబాద్ జిల్లాలోని బోరిగాం గ్రామంలో దళితులు కూర్చున్న రిలే నిరాహార దీక్షలో బుద్ధ విగ్రహం తొలగింపు అన్యాయమని, దీనిపై బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అంబేద్కర్ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విగ్రహాన్ని తొలగించడంపై అధికారులు, "జిల్లా కలెక్టర్ అనుమతితోనే తొలగించాం" అని చెబుతున్నారు. అయితే దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, "ఈ విషయమై ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టంగా చెప్పినప్పటికీ, కొందరి మాటలు విని కావాలనే అధికారులు విగ్రహాన్ని తొలగించారు" అని కమిటీ సభ్యులకు తెలిపారు. దళిత సంఘాల నాయకులు మండిపడుతూ, "ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహం కచ్చితంగా దళితుల సమాజానికి భావపూర్వకంగా కీలకమైనది. నోటీసు ఇవ్వకుండా, సమాచారం లేకుండా విగ్రహాన్ని తొలగించడం నిరంకుశ చర్య" అని తీవ్రంగా విమర్శించారు.

**పునః ప్రతిష్ఠాపనకు డెడ్‌లైన్ :**
రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30లోపు స్పందించి, తొలగించిన స్థలంలోనే బుద్ధ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించకపోతే, జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి అంబేద్కర్ సంఘం సభ్యులు పెద్దఎత్తున "ఛలో బోరిగాం" కార్యక్రమానికి పిలుపునివ్వనున్నట్లు సంఘాలు హెచ్చరించాయి.

**అరాచక నిర్ణయం వెనుక ఉన్న కుట్రను బయటపెట్టాలి :**
విగ్రహం తొలగింపును అధికారికంగా ఎవరు ఆదేశించారో, దానికి అనుమతి ఎలా వచ్చిందనే విషయాలు పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత నేతలు డిమాండ్ చేశారు. బుద్ధుడు మానవ సమానత్వానికి చిహ్నమని పేర్కొంటూ, ఆయన విగ్రహాన్ని తొలగించడమే దళితుల ఆత్మగౌరవంపై దాడిగా పేర్కొన్నారు.

## చోరీకి గురైన ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు**





**చింతపల్లి మే 28 (జనస్వరం) :** మండలంలో ఇటీవల వాహన చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి కీలక పురోగతిని సాధించారు. ఎస్సై వెంకటేశ్వరరావు నేతృత్వంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని పాడేరు-చింతపల్లి ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను నిలిపి, వారి ఆధార్ కార్డులు, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. విచారణలో గతంలో చోరీకి గురైన మూడు పల్సర్ బైకులు ఏపీ40డిజి7548, ఏపీ40ఈబి7332, ఏపీ31డీకే6557 లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన ఇద్దరిలో ఒకరిపై పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి పోలీస్ స్టేషన్లలో మొత్తం ఆరు కేసులు ఉండగా, మరొకరిపై మూడు కేసులు నమోదయ్యాయి. వారిని అరెస్టు చేసి చింతపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా చోరీలు జరిగిన పక్షంలో బాధితులు ఎటువంటి భయం లేకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చుని, తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని హామీ ఇచ్చారు. దర్యాప్తులో హెడ్ కానిస్టేబుల్ తాతాలు సహా పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరివేసుకొని గిరిజన యువతి ఆత్మహత్య



**చింతపల్లి, మే 28 (జనస్వరం) :** మండలంలోని రామారావుపాలెం గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గిరిజన బాలిక పాంగి దివ్య (14) చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దివ్య మండలంలోని వంగసార గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. వేసవి సెలవుల నేపథ్యంలో స్వగ్రామానికి వచ్చి తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతుంది. మంగళవారం ఉదయం వంట చేయమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన దివ్య, గ్రామ సమీపంలోని ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో ఊరికి అటుగా వెళుతున్న వ్యక్తులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా అది దివ్యదిగా గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే అన్నవరం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## అంగన్వాడీ కేంద్రం, బస్తీ దవాఖాన కేంద్రానికి శంకుస్థాపన



**శేరిలింగంపల్లి, మే 28 (జనస్వరం) :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ అంగన్వాడీ స్థలాన్ని కబ్జాయత్నం చేస్తే అడ్డుకొని బుధవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ స్థానిక నాయకులు, ప్రజలతో కలసి శంకుస్థాపన చేస్తారు. త్వరగా అంగన్వాడీ, బస్తీ దావఖానా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకోస్తామన్నారు. ఎక్కడ కూడా ప్రభుత్వ స్థలాలని కబ్జాయత్నాలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అలాగే ప్రతి బస్తీ, కాలనీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరసింహ సాగర్, బసవ రాజు, షేక్ చాంద్ పాషా, శ్రీనివాస్ గౌడ్, రవి శంకర్ నాయక్, నందు, హినాయత్, గువ్వల రమేష్, జుబెర్, రామ కృష్ణ, లక్ష్మి బాయ్, సాగర్ చౌదరి, ఆనంద్ చౌదరి, హిమమ్, సాయి బాబు, రమేష్, స్వామి సాగర్, మల్లికార్జున రెడ్డి, అబ్దుల్ కరీం, మొహ్మద్ మతీన్, కృపాకర్, అబ్దుల్ వసీం, శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఒత్తిడి దూరం

### డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు



**ఏలూరు, మే 28 (జనస్వరం) :** ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరమై మానసికోల్లాసం సాధ్యపడుతుందని డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. బుధవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక వట్లూరు టీటీడీసీలో డిఆర్డిఏ ఉద్యోగులకు యోగాభ్యాసన నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రతిఒక్కరూ ప్రతిరోజు యోగా చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో యోగా మాసోత్సవం నిర్వహణలో భాగంగా జూన్ 20వ తేదీ వరకు ప్రతిరోజు ఒక ప్రభుత్వ శాఖ ఉద్యోగులకు యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగాపై శక్తి, ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏలో పలు విభాగలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## లింగపాలెం టీడీపీ అధ్యక్షుడిగా గరిమళ్ల చలపతిరావు ఏకగ్రీవ ఎన్నిక



**లింగపాలెం, మే 27 (జనస్వరం) :** టీడీపీ అభివృద్ధి, సంక్షేమానికి చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ మరింత క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ బాబు ఆదేశాలతో ముందుకు వెళ్లడం జరుగుతుందని టీడీపీ సీనియర్ నేత, రెండోసారి మండల టీడీపీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన గరిమళ్ల చలపతిరావు అన్నారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా ఎంపికైన చలపతిరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## కొవ్వలిలో టీడీపీ గ్రామ కమిటీ ఏర్పాటుకు అభినందనలు

### అధ్యక్షుడిగా బగాతి చిన్నారావు, ఉపాధ్యక్షుడిగా గోవాడ నాగరాజు



**దెందులూరు, మే 28 (జనస్వరం) :** టీడీపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడం లక్ష్యంగా కొవ్వలి గ్రామ టీడీపీ కమిటీకి కొత్త నాయకులను నియమించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాల మేరకు బగాతి చిన్నారావును గ్రామ అధ్యక్షుడిగా, గోవాడ నాగరాజును ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) మాట్లాడుతూ, "పార్టీ కోసం ప్రతి ఒక్కరూ ఏకంగా పనిచేసి పార్టీ ప్రాభవాన్ని మరింత పెంచాలి. గ్రామ స్థాయిలో బలమైన నేతల్ని ఏర్పాటు చేయడం ద్వారా పార్టీని శక్తివంతంగా తీర్చిదిద్దాలి" అని ఆకాంక్షించారు. కొత్తగా ఎన్నికైన గ్రామ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను పలువురు నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరు నాని బాబు, టీడీపీ సీనియర్ నేత వెలమాటి మోహన్ కృష్ణ, డీసీ (గోదావరి కాల్వ) చైర్మన్ వెలమాటి రాంబాబు, నాయకులు కసుకుర్తి రామకృష్ణ, పప్పల జనార్దన్ రావు తదితరులు పాల్గొని నాయకులను అభినందించారు. కొవ్వలి గ్రామంలో పార్టీని బలోపేతం చేసేందుకు నూతన నాయకత్వం కృషి చేస్తుందని, ప్రజల మద్దతుతో పార్టీని ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

## నేడు ప్రపంచ ఆకలి రహిత దినోత్సవం

### నంద్యాలలో మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో అన్నదానం




**నంద్యాల, మే 28 (జనస్వరం) :** ప్రపంచ ఆకలి రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని మలబార్ గోల్డ్ గ్రూప్ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆకలి రహిత ప్రపంచ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం నంద్యాలలో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మలబార్ గోల్డ్ షోరూమ్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం సేవా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ నంద్యాల డైరెక్టర్ మైఈజ్ మాట్లాడుతూ, "మలబార్ గోల్డ్ గ్రూప్ తమ లాభాల్లో 5 శాతం నిధులను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సేవా కార్యక్రమాలకు కేటాయిస్తోంది. ఇప్పటివరకు 160 కోట్ల రూపాయలు ఖర్చు చేసి దేశవ్యాప్తంగా ప్రతిరోజూ 70 వేల మందికి ఉచిత భోజనాలు అందజేస్తున్నాం" అని తెలిపారు. గత మూడేళ్లలో రెండు కోట్ల నలభై లక్షల భోజనాలను పేదలకు అందించగా, ఈ ఏడాది ఒక్కటే అంతే మొత్తాన్ని లక్ష్యంగా పెట్టుకుని సేవలు అందించేందుకు సంస్థ చైర్మన్ అహ్మద్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అంతేగాక, మలబార్ ట్రస్టు ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళా సాధికారత, ఉచిత ఆరోగ్య సేవలు, పర్యావరణ పరిరక్షణ వంటి పలు సామాజిక కార్యక్రమాల కోసం అదనంగా రూ.150 కోట్ల నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ, "పేదల ఆకలిని తీర్చేందుకు మలబార్ గ్రూప్ చేపట్టిన ఈ భారీ సేవా కార్యక్రమం నిజంగా అభినందనీయం. నంద్యాలలో ఇది ప్రారంభమవడం గర్వకారణం" అని పేర్కొన్నారు. అనంతరం మలబార్ ప్రతినిధులు డాక్టర్ రవికృష్ణకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ నంద్యాల డైరెక్టర్ మైఈజ్, ప్రత్యేక ఆహ్వానితుడిగా వల్లంకొండ జగన్, షోరూమ్ మేనేజర్లు సుధాకర్, గోపి, ప్రతినిధులు మన్సూర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


# సినిమా థియేటర్లపై నిరంతరం నిఘా పెట్టండి

- సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోండి
- ప్రజల జేబుల్ని గుల్ల చేస్తూ... సినిమా అంటేనే భయపడేలా తినుబండారాలు, శీతలపానియాల ధరలు
- ప్రేక్షకుల భద్రత దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్త చర్యలు చేపట్టండి
- నిబంధనలు పాటించని సినిమాహాళ్లపై కఠినచర్యలు తీసుకోవాలి
- జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్‌ను కోరిన జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి



**గుంటూరు, మే 28 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** వినోదం పంచాల్సిన సినిమా హాళ్ళ నిర్వహణపై ప్రజల నుంచి పెద్దఎత్తున వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో సంభంధిత అధికార యంత్రాంగం సినిమా హాళ్ళపై నిరంతరం నిఘా పెట్టాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ్‌ను జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో భార్గవ్ తేజ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ఇష్టానురీతిగా టికెట్ ధరలు పెంచటంపై ఉన్న శ్రద్ధ ప్రేక్షకులకు సదుపాయాలు కల్పించటంపై హాళ్ళ యాజమాన్యానికి లేదని విమర్శించారు. కొన్ని హాళ్ళల్లో కనీసం మంచినీటి సదుపాయం కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక హాళ్ళలో తినుబండారాలు, పాప్ కార్న్, శీతలపానియాల ధరలు దారుణాతి దారుణంగా ఉన్నాయన్నారు. వాటిని ఎమ్మార్పీ కన్నా అరవై నుంచి యనబై శాతం అధిక ధరలకు అమ్ముతూ ప్రేక్షకులు సినిమాకి రావాలంటేనే భయపడేలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. మరికొన్ని హాళ్ళలో అనుకోని ప్రమాదం జరిగితే బయటికి వచ్చేందుకు అత్యవసర ద్వారాలు కూడా సరిగ్గా లేవన్నారు. మరికొన్ని హాళ్ళు అగ్నిమాపక శాఖ నిబంధనలను కూడా పట్టించుకోవటం లేదని, ప్రేక్షకుల భద్రత గాల్లో దీపంలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ఇబ్బడిముబ్బడిగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నిబంధనలు పాటించని సినిమా హాళ్ళ యాజమాన్యంపై కఠిన చర్యలకు సైతం వెనుకాడవద్దని జేసీ భార్గవ్ తేజ్‌ని ఈ సందర్భంగా ఆళ్ళ హరి కోరారు.

## భారీ వర్షాలతో.. శ్రీశైలం జలాశయానికి వరద తాకిడి



**శ్రీశైలం, మే 28 (జనస్వరం) :** నైరుతి రుతుపవనాల కంటే ముందే కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. వీటికి తోడు రుతుపవనాలు ప్రవేశించడంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా మే నెలలో భారీ ఎండల నుంచి ప్రజలను తప్పించిన వాతావరణం అకాల వర్షం రూపంలో వచ్చి చెరువులు, నదులకు పునరుజ్జీవనం పోస్తుంది. అయితే గత 10 రోజులుగా కర్ణాటక, మహారాష్ట్ర,కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం కృష్ణా నదిపై ఉన్న జూరాల డ్యామ్ శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతుంది. ముఖ్యంగా మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న జూరాల ప్రాజెక్టుకు మూడు రోజులుగా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం ఇన్ఫ్లో 3,258 క్యూసెక్కులు ఉండగా ఔట్ ఫ్లో 805 క్యూసెక్కులుగా ఉంది. కంటిన్యూగా వరద వస్తుండటంతో ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 318.516 మీటర్లు కాగా.. ప్రస్తుతం 318.490 మీటర్లకు చేరుకుంది. అలాగే పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంలీలు కాగా.. ప్రస్తుతం 5.928 టీఎంసీలుగా కొనసాగుతోంది. ప్రస్తుతం వస్తున్న వరద ఇలానే కొనసాగితే మరో వారం రోజుల్లో జూరాల డ్యామ్ పూర్తి స్థాయికి నిండి.. గేట్లు ఎత్తే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే శ్రీశైలం ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఉపనదులకు వరద పోటెత్తడంతో శ్రీశైలం జలాశయానికి వరద తాకిడి పెరిగింది. ప్రతి సంవత్సరం జులై నెలలో వరద ప్రారంభం అవ్వనుండగా ఈ సారి అకాల వర్షాల కారణంగా ముందస్తుగానే శ్రీశైలం డ్యామ్‌కు వరద వచ్చి చేరుకుంటుంది. బుధవారం ఉదయానికి ఎగువ నుంచి 4,462 క్యూసెక్కుల వరద వస్తుండగా 19,070 క్యూసెక్కులు ఔట్ ఫ్లో దిగువకు వెళ్తుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా సాయంత్రం 6 గంటల సమయానికి 817.40 అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి ముందస్తుగానే వరద ప్రారంభం కావడంతో అప్రమత్తమైన అధికారులు ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరద కంటే.. దిగువకు వెళ్తున్న ఔట్ ఫ్లో అధికంగా ఉంది.

## రామాలయంలో ఘనంగా స్వర్ణోత్సవ మహా కుంభాభిషేకం వేడుకలు



**నంద్యాల, మే 28 (జనస్వరం) :** పట్టణంలోని సంజీవ నగర్‌లో ఉన్నటువంటి రామాలయంలో బుధవారం స్వర్ణోత్సవం మహాకుంభాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ భగవత్ సేవా సమాజా ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి మహాస్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి పట్టణముతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా దీపారాధన ఎనం గురు వందనం, శాన్తి పాఠం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, మాతృక నాంది దేవతా హెూనం పంచగవ్య ప్రాశనం దీక్ష ధారణ యోగశాల ప్రవేశం వాస్తు సర్వే నిరీక్షణం అఖండ దీప స్థాపన మండపారాధనలు, బ్రహ్మకుల స్థాపన గణపతి రామ తారకం నారాయణ ప్రాక్షరి శివ పంచాక్షరి మూలమంత్ర జపములు వేద పారాయణం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు అశేష తీర్థప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ భగవత్ సేవా సమాజా ఆధ్వర్యంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు అధ్యక్షులు సముద్రాల సూరయ్య ప్రధాన కార్యదర్శి కనకధార మసూదన్ రావు కోశాధికారి భాగం గురు ప్రసాద్, దేవరశెట్టి శ్రీనివాసులు తెలిపారు.

## ధాన్యం మద్దతు ధర పెంపు కంటి తుడుపు చర్య

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విమర్శ



**పెదపాడు (వట్లూరు), మే 28 (జనస్వరం) :** 2025-26 సంవత్సరానికి ఖరీఫ్, రబీ పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర రైతుకు ఏ మాత్రం సరిపోదని, క్వింటాల్‌కు రూ.69 పెంపు కంటి తుడుపు చర్య మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం పెదపాడు మండలం వట్లూరులోని గ్రంథాలయం ఆవరణ లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలపై రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్పత్తి ఖర్చులను తక్కువ చూపించి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించడం వలన రైతులకు కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ రైతుల ఖర్చులు లెక్కబెట్టి ఉత్పత్తి ఖర్చు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధాన్యం క్వింటాల్ కు రూ.3వేలు కనీస మద్దతు ధర ప్రకటించి అమలు చేయాలని కోరారు. మిగిలిన అన్ని పంటలకు కూడా మద్దతు ధరలు పెంచాలన్నారు. ఈ సమావేశంలో రైతులు తుమ్మల ధన కోటేశ్వరరావు, కొమ్మన సాంబశివ రావు, కొమ్మినేని అచ్యుత రావు, కొల్లిపర కొండలరావు, మండవల్లి గోపాలకృష్ణ, నెరుసు కొండలు, పాపిశెట్టి రాంబాబు,లోయ మురళీ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి

### ప్రభుత్వ బాలికా వసతి గృహాన్ని సందర్శన



**దెందులూరు, మే 28 (జనస్వరం) :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ బుధ వారం స్థానిక ప్రభుత్వ బాలికా వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతినెల ఈ బాలిక వసతి గృహాన్ని సందర్శించి బాలికలకు అందుతున్న ఆహార, వైద్య, విద్య, రక్షణ మొదలైన సదుపాయాల వివరాలను పరిశీలించాల్సిన బాధ్యత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పై ఉందని, అందులోని భాగంగా ఈవేళ వచ్చినట్లు తెలిపారు. బాలికలు యోగా శిక్షణ పొందడం హర్షించదగ్గ విషయమని, వేసవి సెలవుల్లో దేహదారుఢ్యం, మానసిక వికాసాన్ని పెంపొందించు కోవడానికి కృషి చేయాలని సూచించారు. బాలికలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలిక వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

### పాస్‌పుస్తకాలు, రేషన్, పెన్షన్ అంశాలపై సమీక్ష




**యలమంచిలి, మే 28 (జనస్వరం) :** నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ బుధవారం మున్సిపాలిటీలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల పాస్ పుస్తకాలు, విలేజ్ మ్యాపులు, ఇతర సంబంధిత రికార్డులను వివరంగా పరిశీలించిన ఆయన, కార్యాలయంలోని సేవల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు అధికారులతో సమావేశం జరిపిన ఎమ్మెల్యే, ప్రజల ఇబ్బందులు నివారించేందుకు రేషన్ కార్డులు, పెన్షన్ పాస్ పుస్తకాల పంపిణీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు ఉండేలా చూడాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల గౌరవానికి ప్రతీక.. అన్న ఎన్టీఆర్

- ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి ఉత్సవం
- తెలుగు మహిళల ప్రత్యేక హారతి, పిండి వంటలతో ఎన్టీఆర్‌కు ఘన నివాళి



**విజయవాడ, మే 28 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటించిన యుగపురుషుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతిని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, తెలుగుమహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఎన్టీఆర్‌కు గాఢమైన అభిమానం గల తెలుగు మహిళలు ఆయనకు ఇష్టమైన పలు రకాల పిండి వంటలను తయారు చేసి విగ్రహం ముందుంచి తమ ప్రేమను చాటారు. కార్యక్రమం సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ "ఎన్టీఆర్ సినీ రంగంలో తిరుగులేని కథానాయకుడిగా చరిత్రకెక్కారు. అదే విధంగా రాజకీయ రంగంలో ప్రజా సంక్షేమానికి అంకితమైన నేతగా ఎదిగి తెలుగువారి గౌరవాన్ని జాతీయ స్థాయిలో ప్రతిష్ట పెంచారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చరిత్రాత్మక మలుపు తీసుకువచ్చాయి" అని కొనియాడారు. సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ ఆశయాలకు కట్టుబడి, పార్టీని నేటికీ సమర్థంగా నడిపిస్తున్నారన్న నాయకులు, ఎన్టీఆర్ స్వప్నాలను నెరవేర్చే దిశగా పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ సీనియర్ నేతలు తూమాటి ప్రేమనాథ్, నరసింహచౌదరి, మాజీ ప్రచార కార్యదర్శి కిలారి చంద్రశేఖర్, ఎస్సీ రాష్ట్ర ప్రతినిధి పరిశపోగు రాజేష్, మైనార్టీ నాయకులు ఎం.డి. ఇర్ఫాన్, మీర్జా అబీద్ హుస్సెన్, తదితరులు పాల్గొన్నారు. తెలుగుమహిళా నాయకులు చెరుకూరి మాధవి, కొనసాని నాగమణి, మాదల చిన్న తల్లి, చిట్టా నిర్మల, సూర్యకుమారి వంటి పలువురు మహిళా నేతలు ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్టీఆర్ జయంతిని స్మరణీయంగా మార్చారు.

# విజనరీ నేత చంద్రబాబు దేశానికే మార్గదర్శకం

- ఎంపీ కేశినేని శివనాథ్
- మహానాడులో టీడీపీకి రూ.25 లక్షల విరాళం ప్రకటించిన ఎంపీ చిన్నీ
- జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సీఎం చంద్రబాబుకు ఎన్టీఆర్ జిల్లా ప్రజల తరఫున శుభాకాంక్షలు



**విజయవాడ, మే 28 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా సీఎం చంద్రబాబు మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నీ) హర్షం వ్యక్తం చేశారు. మహానాడు రెండో రోజు బుధవారం జరిగిన ఈ అభిషేక సభలో తన ఆనందాన్ని వెల్లడించిన ఆయన, చంద్రబాబు విజయవంతమైన, దూరదృష్టి కలిగిన, పారదర్శక పాలనతో రాష్ట్రానికే కాకుండా దేశానికీ మార్గదర్శకంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా ప్రజల తరఫున ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ చిన్నీ, "టీడీపీని తిరుగులేని శక్తిగా మార్చిన నాయకుడు చంద్రబాబు. ఆయన అభివృద్ధి దృక్కోణం, కార్యకర్తల సంక్షేమానికి తపన, పార్టీకి శాశ్వత మద్దతునందించే విధానం ఆదర్శప్రాయంగా మారాయి," అని కొనియాడారు. చంద్రబాబు నాయకత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసమే పార్టీని ఈ స్థాయికి తీసుకువచ్చిందని చెప్పారు.

**మహానాడులో రూ.25 లక్షల విరాళం :**
తెలుగుదేశం భవిష్యత్ నిర్మాణ నిధి కోసం ఎంపీ కేశినేని శివనాథ్ మహానాడు వేదికపై రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించారు. పార్టీ భవిష్యత్తు అవసరాల కోసం ఒకరిపై ఆధారపడకుండా విరాళాలు సేకరిస్తున్న సందర్భంలో తమ పేరును ప్రకటించటంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారనీ ఆయన వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధితో పాటు టీడీపీ ఎదుగుదల కోసం తన శక్తి మేరకు పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీ కేశినేని వ్యాఖ్యల్లో, చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితంలో అందించిన సేవలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాయని వెల్లడించారు. దేశ రాజకీయాల్లో మార్గదర్శకులుగా నిలిచే స్థాయికి చంద్రబాబు నాయకత్వం ఎదిగిందని కొనియాడారు.

## రేమా వర్క్‌షిప్‌లో ఆర్థిక అవగాహన సదస్సు నిర్వహణ



**కంకిపాడు, మే 28 (జనస్వరం) :** మండలంలోని రేమా వర్షిప్ వద్ద ఆర్థిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేమా వర్షిప్ సభ్యులు బాణాసంచా కాల్చి, ప్రత్యేకంగా అందరికీ ఘన స్వాగతం పలికారు. ఫిన్వేస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ రాకేష్ అలమండ మాట్లాడుతూ, దేశ ఆర్థిక అభివృద్ధికి ప్రతి ఒక్క మధ్యతరగతి కుటుంబం ఆర్థికంగా బలంగా ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. రాకేష్ అలమండ స్పష్టం చేసినట్లుగా, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రతి మధ్యతరగతి కుటుంబం స్వతహాగా వ్యాపారాలు నిర్వహించి, పది మందికి ఉపాధి అవకాశాలు సృష్టించేలా ఆర్థిక రుణాలను తక్షణమే మంజూరు చేయడం ద్వారా తమ సంస్థ ప్రోత్సాహక చర్యలు చేపడతుందని చెప్పారు. తదుపరి రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో మరింత సేవలను విస్తరించే ప్రణాళికతో తమ సంస్థ ముందుకు వెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేమా వర్షిప్ నిర్వాహకులు కలపాల నవీన్ కుమార్, బాలాజీ, ఫిన్వేస్కో సంస్థ ప్రతినిధి సుధీర్ తదితరులు పాల్గొన్నారు. రాకేష్ అలమండ ప్రసంగం ఈ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు


- పులిరామన్నగూడెం పంచాయతీ నూతన భవన శంకుస్థాపన,
  ఉచిత మంచినీటి ప్లాంట్ ప్రారంభం



**బుట్టాయిగూడెం, మే 28 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** మండలంలోని పులిరామన్నగూడెం పంచాయతీలో నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటన నిర్వహించారు. గ్రామస్తులతో ముచ్చటించి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. గ్రామంలో వాగు ప్రవాహం కారణంగా రోడ్లు నష్టం పడ్డ ఘటనలను గమనించి, వచ్చే వర్షాకాలంలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా రిటర్నింగ్ వాల్ నిర్మాణంపై అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలో త్వరితగతిన సిసి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రవ్వవారిగూడెం పంచాయతీకి రూ.32 లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభించబోతున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. భవనం తక్కువ సమయంలో నిర్మించబడుతూ ప్రజలకు అందుబాటులోకి రావాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పులిరామన్నగూడెంలో ఉచిత మంచినీటి ప్లాంటును కూడా ప్రారంభించారు. ఇటీవల జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ నాదెండ్ల మనోహర్ పశ్చిమ ఏజన్సీ పర్యటనలో ఈ ప్రాంత ప్రజలు మంచినీటి సమస్యలపై మోర పెట్టిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్లాంటు ఏర్పాటు చేసింది. ప్రజలు ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పండుగగా ఎన్టీఆర్ జయంతి

**ప్రభుత్వం జీవో విడుదలపై తెలుగు శక్తి హర్షం**



**విశాఖపట్నం, మే 28 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** దివంగత ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా విశాఖపట్నంలో తెలుగు శక్తి ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉదయం రామకృష్ణ బీచ్‌లోని ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జయంతి ఉత్సవాల ఉల్లాసంగా కేక్ కట్ చేసి పంచారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మీడియాతో మాట్లాడుతూ, ఎన్టీఆర్ జయంతిని ప్రతి సంవత్సరం పండుగలా జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో విడుదల చేయడం పట్ల గర్వంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక నిర్ణయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తెలుగు ప్రజల హృదయాలను ఉప్పొంగించే ఘనతగా అభివర్ణించారు. అంతేకాక, ఈ రోజును సంక్రాంతి, దసరా, దీపావళి మూడు పండుగల పొట్టిగా పోల్చి, ప్రపంచవ్యాప్తంగా తెలుగు జనుల ఆనందానికి కారకం ఇదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆయురారోగ్యంతో నిండి ఎన్నో సంవత్సరాలు జీవించాలని ఆకాంక్షించారు. తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ అన్నారు, ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా చేసేందుకు చాలా ప్రయత్నాలు చేశామని, కొందరు వైసీపీ కోవర్ట్ అని ఆరోపించినప్పటికీ తమ టీడీపీ పట్ల నిబద్ధత అజరామరమని తెలియజేసారు. తమ పార్టీ సభ్యత్వ కార్డు కూడా మీడియా ముందు ప్రదర్శించి, నిజంగా వైసీపీ కోవర్ట్ అయితే ఎందుకు ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వ పండుగగా జరుపుకునేందుకు పోరాటం చేస్తానని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కోడే బాబురావు, డాక్టర్ పెంటకోట త్రినాధ రావు, రావి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కూనవరంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు




**కూనవరం, మే 28 (జనస్వరం) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మహానటుడు, మాసలెడర్ నందమూరి తారక రామారావు జయంతిని కూనవరంలో బుధవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి మండల టీడీపీ అధ్యక్షుడు బి. ప్రకాష్ రావు, సీనియర్ నాయకులు ఎడవల్లి భాస్కరరావుతో కలిసి పారాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బి.ప్రకాష్ మాట్లాడుతూ, "విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ చలనచిత్ర రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగెత్తారు. 'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది నెలల కాలంలోనే ప్రజల విశ్వాసంతో అధికారంలోకి వచ్చారు. ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారు," అన్నారు. అలాగే ఆయన పాలనలో పాలనా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి, సామాన్యుడికీ రాజకీయాన్ని చేరువ చేశారు. తెలుగు జాతి గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిలబెట్టిన ఎన్టీఆర్, నిజంగా ఆంధ్రుల అన్నగా, ఆరాధ్య నేతగా తెలుగు హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. సీనియర్ నాయకుడు ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ, "ఎన్టీఆర్ ఆశయాలే తెలుగుదేశం పార్టీ ఆత్మ. పేదల పక్షాన పని చేయాలన్న ఆయనే చూపిన మార్గంలో నేడు టీడీపీ కొనసాగుతోంది. ప్రతి కార్యకర్త ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలి," అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెలికాని ఉమా, గడ్డిపాటి ప్రసాద్, ఎచ్చు రాము, సోమక సత్యనారాయణ, పి. అప్పారావు, నోముల సత్యనారాయణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచింది టీడీపీనే

**బీసీ సెల్ అధ్యక్షులు నరసింహ రాజు**



**నెల్లూరు, మే 28 (జనస్వరం) :** టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి ఉదయగిరి మండలం నుండి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. బీసీ సెల్ నాయకులు నరసింహ రాజు ఆధ్వర్యంలో ఈ బృందం మహానాడు కార్యక్రమానికి చేరుకుంది. ఈ సందర్భంగా నరసింహ రాజు మాట్లాడుతూ టీడీపీ స్థాపించిన నాటి నుండి పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ పార్టీ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. "తారక రామారావు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ నేటి నేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారు. అమరావతిని ప్రపంచంలోని ఒక ప్రత్యేకత గల రాజధానిగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు" అని ప్రశంసలు కురిపించారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అహర్నిశలు శ్రమిస్తూ, "ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేను ఉన్నాను" అంటూ ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు. ఉదయగిరి ప్రజలకు నూతన ఆశాజ్యోతి చూపుతున్న ఎమ్మెల్యే సురేష్ నాయకత్వం పట్ల కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మహానాడు వేదికపై తెలుగుదేశం పార్టీ విజయ భవిష్యత్తుకు అంకితభావంతో నినాదాలు చేస్తూ పాల్గొన్నారు.

## ఘనంగా 16 రోజుల పండగ కార్యక్రమం



**నెల్లూరు, మే 28 (జనస్వరం) :** రూరల్ పరిధిలోని కలివేల పాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు, కళ్యాణం పూర్తయి 16 రోజులైన సందర్భంగా 16 రోజుల పండుగ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులచే విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వెడిచర్ల వెంకటేశ్వర్లు యాదవ్, వెడిచర్ల రవీంద్ర యాదవ్, చేవూరు మస్తాన్ యాదవ్, మేకల కృష్ణయ్య యాదవ్, ఉడతా వెంకటేశ్వర్లు యాదవ్ వ్యవహరించారు.

## కాపు మహిళలకు ఆర్థిక చేయూత

**15 వేలు ఇచ్చేలా 'గృహిణి' పథకం.. కాపు కార్పొరేషన్ ప్రతిపాదన**

**అమరావతి, మే 28 (జనస్వరం) :** కాపు మహిళలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు గృహిణి అనే పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు వెల్లడించారు. ఈ పథకం ద్వారా కాపు మహిళలకు ఒక్కసారి (వన్‌టైం) కింద రూ.15 వేలు అందించాలని కార్పొరేషన్ ప్రతిపాదించింది. ఇందుకోసం రూ. 400 కోట్లు అవసరమని అంచనా వేసింది. ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుబ్బారాయుడు మాట్లాడుతూ... చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కాపు సంక్షేమానికి రూ.4,600 కోట్లు కేటాయించిందని, ఏడాదిలో వాటి ఫలితాలు చూపిస్తామని తెలిపారు.

## రాష్ట్రమంతటా రుతుపవనాలు

**పక్షం రోజుల ముందే విస్తరించిన నైరుతి**

**విశాఖపట్నం, అమరావతి, మే 28 (జనస్వరం) :** నైరుతి రుతుపవనాలు బుధవారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించాయి. సాధారణంగా మే 27కు అండమాన్‌కు రావాల్సి ఉండగా, ఈ ఏడాది మే 13నే వచ్చాయి. దేశంలోకి జూన్ 1కి వచ్చే రుతుపవనాలు ఈసారి మే 24నే కేరళను తాకాయి. రాయలసీమకు జూన్ 4న వచ్చి, రాష్ట్రమంతా జూన్ 13 నాటికి విస్తరించాల్సి ఉండగా, ఈ సారి మే 26నే రాయలసీమలోకి ప్రవేశించాయి. ఆపై జూన్ 13 నాటికి ఇచ్ఛాపురం వరకు వెళ్లాల్సి ఉండగా, 15 రోజుల ముందే రాష్ట్రమంతా విస్తరించాయి.

**వర్షాలు.. ప్రమాదాలు.. జాగ్రత్త :**
మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. గురువారం నాటికి ఉత్తరంగా పయనించి వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని, వర్షాలు కురిసే సమయంలో గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. విశాఖ ఆర్కే బీచ్‌లో సముద్రం ముందుకువచ్చింది. కురుసుర మ్యూజియం వద్ద తీరం కోతకు గురైంది.

## టీడీపీ జెండాలు ఫ్లెక్సీల తొలగింపు..

- పోలీసుల అదుపులో పులివెందుల మున్సిపల్ చైర్మన్
- వైస్‌చైర్మన్ సహా మరో 11 మంది కూడా..

**పులివెందుల, మే 28 (జనస్వరం) :** టీడీపీ జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు వివాదంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్‌చైర్మన్ హాఫిజుల్లాతో పాటు మరో పదిమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ మహానాడు సందర్భంగా మంగళవారం పులివెందులలో పార్నపల్లె కూడలి నుంచి రింగురోడ్డు వెంబడి కడప కూడలి వరకు ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు. వైఎస్ విగ్రహాల వద్ద కూడా జెండాలు, తోరణాలు ఏర్పాటు చేశారు. దీంతో వైసీపీ కార్యకర్తలు తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలను చించేశారు. ఈ ఘటనకు సంబంధించి బుధవారం రాత్రి పోలీసులు మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ సహా 12 మందిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇది తెలుసుకున్న వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి మరికొందరు నాయకులు లాయర్‌తో కలిసి వెళ్లి డీఎస్పీ మురళి నాయక్‌తో చర్చించారు.

## అరాచక పాలనపై యువగళం అక్షర రూపం

**చంద్రబాబుకు పుస్తకాన్ని అందించిన మంత్రి లోకేశ్**

**కడప, మే 28 (జనస్వరం) :** జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనపై గళమెత్తుతూ చేపట్టిన యువగళం పాదయాత్ర విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ రెండోరోజు బుధవారం మహానాడు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. జగన్ అరాచకాలను ఎలుగెత్తుతూ 2023 జనవరి 27న లోకేశ్ కుప్పం శ్రీవరదరాజస్వామి పాదాల చెంత నుంచి ప్రారంభించిన పాదయాత్ర 226 రోజులు సాగింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో మలుపు తిప్పింది. ఉమ్మడి 13 జిల్లాల్లో 97 నియోజకవర్గాలు, 232 మున్సిపాలిటీలు, కార్పొరేషన్, మండలాలు 2097 గ్రామాల్లో 3132 కి.మీ. మేర పాదయాత్ర సాగింది. పాదయాత్రకు వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అడ్డంకులు నాటి అరాచక పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, కన్నీటి గాథలను పుస్తకంలో సచిత్రంగా కళ్లకు గట్టినట్లు చూపారు. సీఎం ఆసక్తిగా తిలకించి లోకేశ్‌ను అభినందించారు. యువగళం ద్వారా రాష్ట్ర ప్రజల్లో చైతన్యం నింపారని, నాటి అనుభవం పుస్తకాల రూపంలోకి తీసుకురావడం బాగుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా లోకేశ్.. చంద్రబాబుకు పాదాభివందనం చేశారు.

**లోకేశ్‌కు కీలక పదవి ఇవ్వండి :**
లోకేశ్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. బుధవారం మహానాడు వేదికపై నుంచే పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. ఆయనకు వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఇవ్వాలని తమ ప్రసంగాల్లో కోరారు. వీరిలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంఎస్ రాజు తదితరులు ఉన్నారు.

## రెండో రోజు.. లక్ష మందికి..

- 'మహానాడు'లో ఎన్టీఆర్‌కు ఇష్టమైన వంటకాలు
- వెజ్, చికెన్, మటన్‌తో భోజనాలు



**కడప రూరల్, మే 28 (జనస్వరం) :** కడప గడ్డపై జరుగుతున్న మహానాడులో రెండో రోజు బుధవారం 3 పూటలకు కలిపి లక్ష మందికి భోజన వసతి కల్పించారు. రాయలసీమ రుచులతో పాటు టీడీపీ వ్యవస్థాపకుడు, విశ్వ విఖ్యాత... దివంగత ఎన్టీ రామారావుకు ఇష్టమైన నేతితో తయారు చేసిన స్వీట్లతో పాటు చక్కెర పొంగలి, వెజిటబుల్ పలావ్, చికెన్, మటన్ ఐటమ్స్‌తో భోజనాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజులా కాకుండా రెండో రోజు ఉదయం 11 గంటల నుంచే భోజనాలను ప్రారంభించారు. దీంతో భోజనం చేయదలుచుకున్న వారు ప్రతినిధుల సభ నుంచి అప్పుడప్పుడూ కొద్దికొద్దిగా వచ్చి భోజనం చేసి తిరిగి సభకు హాజరయ్యారు. స్టేజి సభ్యుల (వీవీఐపీ) భోజనశాల, వీఐపీ భోజనశాల, మీడియా భోజనశాల సాఫీగా కొనసాగింది. వేర్వేరుగా రెండు చోట్ల ఏర్పాటు చేసిన ప్రతినిధుల భోజనశాలలో మాత్రం కాస్త రద్దీగా కనిపించింది. రెండోరోజు సభకు లెక్కకు మించి ప్రతినిధులు హాజరయ్యారు. ఇందుకు తగ్గట్టుగా కౌంటర్లను పెంచకపోవడంతో కాస్త ఇబ్బందులకు లోనయ్యారు. అయినప్పటికీ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అందరికీ భోజనం అందించగలిగారు. లెక్కకు మించి ప్రతినిధులు హాజరవుతారని తాము ముందుగానే ఊహించి భోజనాలను సిద్ధం చేసినట్లు వంట కాంట్రాక్టర్ కిలారు వెంకటశివాజీ తెలిపారు. ఉదయం అల్పాహారంలో స్వీట్‌తో కేసరి, టమాటా బాత్, ఉప్మా, ఇడ్లీ, వడ, సాంబారు, పల్లీ చట్నీ, టమాటా చట్నీలను అందించామన్నారు.

## 5 లక్షల మందితో నేడు సభ

- 50 నియోజకవర్గాల నుంచి భారీగా సమీకరణ
- ఉమ్మడి కడప జిల్లా తరఫున 2.10 లక్షల మంది!
- మహానాడు చివరిరోజు గురువారం కడపలో నిర్వహించే బహిరంగ సభను సీఎం చంద్రబాబు, లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

**కడప, మే 28 (జనస్వరం) :** 5లక్షల మందితో నభూతో సభ జరిపి.. జగన్ సొంత జిల్లాలో పసుపు సైన్యం సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నారు. సాయంత్రం 4 గంటలకు మహానాడు వేదిక వద్దే ఈ సభ జరుగుతుంది. కడప సహా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేస్తున్నారు. ఒక్క ఉమ్మడి కడప జిల్లా నుంచే 2.10 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కడప, కమలాపురం, రాయచోటి నియోజకవర్గాల నుంచి 40వేల చొప్పున.. మైదుకూరు–30 వేలు, రాజంపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రైల్వేకోడూరు నుంచి 20వేల మంది చొప్పున తరలించాలని నిర్ణయించారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు మొత్తం 5వేల వాహనాలను ఇందుకు వినియోగించనున్నారు. బుధవారం మహానాడు ప్రాంగణంలో మంత్రులు అనిత, నారాయణ, రాంప్రసాద్‌రెడ్డి సభ ఏర్పాట్లపై చర్చించారు.